క్లుప్తంగా

స్వామివారికి ఆభరణాల బహూకరణ



లింగంపర్తిలో ఆభరణాలతో స్వామి, అమ్మవార్లు

ఏలేశ్వరం: కలియుగ దైవమైన వేంకటేశ్వర స్వామి వారికి శనివారం భక్తులు ఆభరణాలు బహూకరించారు. లింగంపర్తిలోని శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి వారి ఆలయానికి ఇత్తడి మకరతోరణం, మూడు వెండి కిరీటాలు భక్తులు సమర్పించారు. ముందుగా స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు.

అన్నసమారాధన

గండేపల్లి: తాళ్లూరు మఠంలో జీయన్న దర్శనానికి వచ్చిన భక్తులకు శనివారం అన్న సమారాధన నిర్వహించారు. జగ్గంపేట ఎస్సై సీహెచ్ విద్యాసాగర్ జన్మదినం సందర్భంగా ఆయన అందజేసిన ఆర్థిక సహాయం, ఇతర భక్తుల సహాయ సహకారాలతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్టు జీయర్ శాశ్వత అన్నదాన నిధి కమిటీ సభ్యులు తెలియజేశారు.

బాధితులకు సాయం



బాధితులకు సరకులు అందజేస్తున్న శివకుమార్

ఏలేశ్వరం: భారత చైతన్య యువజన పార్టీ ఆధ్వర్యంలో ఇటీవల పట్టణంలోని అంబేద్కర్‌నగర్‌లో జరిగిన అగ్నిప్రమాదంలో నష్టపోయిన బాధితులకు శనివారం సహాయం చేశారు. నియోజకవర్గ బీసీ నేత గొంప శివకుమార్‌యాదవ్ బాధితులైన తుమ్మలపల్లి బాబూరావు, పేకేటి నాగమ్మలకు బియ్యం, కిరాణా, కూరగాయలు అందజేశారు. బాధితులకు తమవంతు సహకారం అందిస్తామని ఆయన తెలిపారు. వియ్యపు రాము, కోరాడ సత్తిబాబు, మురుకుర్తి వినోద్, కుండల శ్రీను, బాబ్జీ, రామకృష్ణ,వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు దుస్తుల పంపిణీ

గోకవరం: వీరలంకపల్లిలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో చదువుతున్న ఏడుగురు విద్యార్థులకు శనివారం ఎంపీపీ సుంకర శ్రీవల్లీవీరబాబు దంపతుల కుమార్తె సావిత్రి పుట్టిన రోజు సందర్భంగా దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ సుంకర శ్రీవల్లి మట్లాడుతూ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు ఏ అవసరం వచ్చినా మా దృష్టికి తీసుకురావలన్నారు. వంట సామగ్రి కొరతను సిబ్బంది వారి దృష్టికి తీసుకురాగా త్వరలోనే ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు వెంకటరమణ, పాఠశాల ప్రిన్సిపాల్ మంజుల వేణిరాణి పలువురు సిబ్బంది ఉన్నారు.


గజ్జనపూడి వార్డు సభ్యురాలిగా నమ్మి లోవలక్ష్మి



ఓటు వేసేందుకు క్యూలో ఉన్న ఓటర్లు

ప్రత్తిపాడు రూరల్: ప్రతిపాడు మండలంలో గజ్జనపూడి గ్రామంలో శనివారం వార్డు సభ్యుడి ఎన్నికల్లో నమ్మి లోవలక్ష్మి విజయం సాధించినట్టు ఎన్నికల అధికారి, ఎంఈఓ-2 అచ్చిరాజు తెలిపారు. గ్రామంలో 6వ వార్డు నమ్మి శ్రీను సంవత్సర క్రితం మరణించాడు. ఆయన స్థానంలో జరిగిన ఈ ఎన్నికల్లో లోకా మాణిక్యం, నమ్మి లోవలక్ష్మి పోటీ చేశారు. ఈ ఎన్నికల్లో లోకా మాణిక్యంపై నమ్మి లోవలక్ష్మి 10 ఓట్ల తేడాతో విజయం సాధించారు. వార్డు పరిధిలో 222 ఓట్లకు 172 ఓట్లు పోలయ్యాయి. నమ్మి లోవలక్ష్మికి 91, లోకా మాణిక్యానికి 81 ఓట్లు పోలైనట్టు పోలింగ్ అధికారి, ఎంఈఓ వి.రాజబాబు తెలిపారు. స్థానిక ఎస్సై పి.పవన్‌కుమార్ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు నిర్వహించారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ తగిలి పాడి గేదె మృతి



మృతి చెందిన గేదె

ప్రత్తిపాడు రూరల్: రౌతుపాలెంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ తగిలి చూడి గేదె మృతి చెందింది. గ్రామానికి చెందిన పాడి రైతు దాసరి వీరాస్వామి తొమ్మిది నెలల గర్భంతో ఉన్న గేదె రాత్రి సమయంలో తాడు తెగిపోయి బయటకు వెళ్లిపోయింది. గ్రామ శివారున విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ బాగా కిందకు ఉండడంతో అది తగిలి గేదె విద్యుత్ షాక్‌తో మృతి చెందిందని వీరాస్వామి తెలిపారు. ఒమ్మంగి పశువైద్యాధికారి ఇ.సతీష్‌కుమార్ గేదెకు పోస్టు మార్టం నిర్వహించారు.

ఆరోగ్యమస్తు..



కోటనందూరు పీహెచ్‌సీలో గర్భిణులకు భోజనం వడ్డిస్తున్న ప్రజాప్రతినిధులు

- ప్రభుత్వ వైద్యం.. పేదలకు వరం
- మండలానికి రెండు పీహెచ్‌సీలు
- ప్రతి పీహెచ్‌సీకి ఇద్దరు డాక్టర్లు, అవసరం మేర వైద్య సిబ్బంది
- అందుబాటులో మందులు, మౌలిక వసతులు
- పేదల ముంగిటకు వైద్య సేవలు



కోటనందూరులో వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ ఇందిరాప్రియదర్శిని

కోటనందూరు: పల్లె ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోంది. అందులో భాగంగానే సీఎం జగన్ మోహన్‌రెడ్డి వైద్య విధానంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారు. మండలంలో రెండు పీహెచ్‌సీలు ఉండేలా చర్యలు తీసుకొని అన్ని రకాల మౌళిక వసతులు కల్పించి సగటు పేదవాడికి కార్పొరేట్ వైద్యాన్ని అందిస్తున్నారు. పీహెచ్‌సీల్లో అన్ని రకాల మందులు, రక్తపరీక్షలతో పాటు 108, 104 వాహనాలను అందుబాటులో ఉంచి మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నారు. ప్రభుత్వ వైద్యంపై ప్రజల నుంచి హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

నాడు–నేడు వైద్య సేవలు

గతంలో పేదవాడికి ప్రభుత్వ వైద్యం అందని ద్రాక్షగా ఉండేది. దశాబ్దాల పాటు వైద్య సిబ్బంది కొరత పీహెచ్‌సీని వేధించేది. ఆసుపత్రి ఒక్క పూటే పని చేసే దయనీయ పరిస్థితి ఉండేది. 108, 104 వాహనాలు అందుబాటులో లేక ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడేవారు. నేడు వైద్య విధానం గతానికి పూర్తి భిన్నంగా మారింది. 60 వేల జనాభా ఉన్న ఈ మండలంలో కోటనందూరు, పాతకొట్టాం పీహెచ్‌సీల ద్వారా సుమారు 100 గ్రామాల ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నారు. రెండు పీహెచ్‌సీల్లో ఇద్దరేసి డాక్టర్లతో పాటు అవసరం మేర వైద్య సిబ్బందిని నియమించారు. పీహెచ్‌సీల్లో రోజూ 150 నుంచి 200 వరకూ ఓపీ నమోదవుతుంది. కోటనందూరు పీహెచ్‌సీలో నెలకు 5 నుంచి 10 ప్రసవాలు జరుగుతున్నాయి. ఇక్కడ అన్ని రకాల వైద్య పరీక్షలు చేస్తున్నారు. మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో పారామెడికల్ వైద్య సిబ్బందితో పాటు మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్(ఎంఎల్‌హెచ్‌పీ)లు సైతం పూర్తి స్థాయిలో అందుబాటులో ఉండి వైద్య సేవలు అందిస్తున్నారు. మండలానికి 108, 104 వాహనాలు కేటాయించి 24 గంటలూ వైద్య సేవలు అందుబాటులో ఉంచారు.

పల్లెల్లో ఫ్యామిలీ డాక్టర్

పల్లెలో ఫ్యామిలీ డాక్టర్ వైద్య సేవలను అందుబాటులోకి తీసుకొచ్చారు. వైద్యులతో పాటు అన్ని విభాగాల వైద్య సిబ్బంది నేరుగా ప్రజల వద్దకే వెళ్లి వైద్య సేవలు అందిస్తున్నారు. దీంతో ప్రయాణ ఖర్చులతో పాటు తిరిగే ఇబ్బంది తప్పిందని పల్లె ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మంచానికి పరిమితమైన వృద్ధులు, దివ్యాంగులు, ఆరోగ్యశ్రీ రోగులను పరామర్శిస్తూ ఇంటి ముంగిటే వైద్య సేవలు అందిస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి వారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుంటున్నారు.

గర్భిణులకు భోజన వసతి

పీఎంఎస్ఎంఏ పథకంలో భాగంగా స్థానిక పీహెచ్‌సీలో ప్రతి నెలా 9వ తేదీన 80 నుంచి 100 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. దూర ప్రాంతాల నుంచి వచ్చేవారికి ఇబ్బంది లేకుండా ఎంపీపీ లగుడు శ్రీనివాసు ఆధ్వర్యంలో నెలకొక ప్రజాప్రతినిధి ఆర్థిక సహాయంతో భోజన వసతి ఏర్పాటు చేస్తున్నారు. గత నాలుగేళ్లగా ఈ కార్యక్రమం దిగ్విజయంగా కొనసాగుతోంది.

సకాలంలో వైద్యం



వృద్ధాప్యంతో ఎక్కడికి వెళ్లలేకున్నా. ఆసుపత్రికి కూడా వెళ్లలేని స్థితిలో ఉన్నా. ఇప్పుడు వైద్య సిబ్బంది మా ఇంటికే వచ్చి పరీక్షలు చేస్తున్నారు. మాలాంటి వృద్ధులకు సకాలంలో వైద్య సేవలు అందుతున్నాయి. చాలా సంతోషంగా ఉంది. ఫ్యామిలీ డాక్టర్ విధానం పేదవారికి వరం లాంటిది. ఈ ప్రభుత్వం మేలు మరువలేం.

– కామిరెడ్డి సత్యనారాయణ, బిళ్లనందూరు

గ్రామంలోనే సేవలు



గతంలో మా గ్రామస్తులకు ప్రభుత్వ వైద్యం అందేది కాదు. మా గ్రామం నుంచి కోటనందూరు పీహెచ్‌సీకి వెళ్లాలంటే 10 కిలోమీటర్లు ప్రయాణించాలి. అత్యవసర వైద్యం అవసరమైనప్పుడు గ్రామస్తులు ఎన్నో ఇబ్బందులు పడేవారు. ఇప్పుడు మా గ్రామంలో పీహెచ్‌సీని ఏర్పాటు చేశారు. డాక్టర్లు, వైద్య సిబ్బంది అందుబాటులో ఉన్నారు. ఈ ప్రభుత్వం వైద్యానికి అధిక ప్రాధాన్యత ఇవ్వడం సంతోషించదగ్గ విషయం.

– పీవీ నరసింహారావు, పాతకొట్టాం

అందుబాటులో అన్ని రకాల మందులు



రెండు పీహెచ్‌సీల్లో గర్భిణులు, బాలింతలతో పాటు కుక్క, పాముకాటుకు అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయి. ఆపరేషన్ థియేటర్‌తో పాటు అన్ని విభాగాల్లో విద్యుత్ వెలుగులు, ఇతర వసతులకు ఇబ్బందులు లేదు. అందుబాటులో ఉండి రోగులకు 24 గంటలూ వైద్య సేవలు అందిస్తున్నాం. కోటనందూరు పీహెచ్‌సీకి వచ్చే గర్భిణులు, రోగుల సౌకర్యార్థం స్థానిక ప్రజాప్రతినిధుల తోడ్పాటుతో షెల్టర్ నిర్మాణం, ఫ్యాన్ల ఏర్పాటు చేశాం.

– డాక్టర్ ఇందిరాప్రియదర్శిని, వైద్యాధికారి, కోటనందూరు

ప్రజల ముంగిటకు ప్రభుత్వ సేవలు



కాండ్రేగులలో సచివాలయాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు

జగ్గంపేట: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ సేవలను ప్రజల ముంగిటకు తీసుకు వచ్చి చూపించారని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. మండలంలోని రామవరం, కాండ్రేగుల గ్రామంలో నూతనంగా నిర్మించిన సచివాలయ భవనాలను ఆయన శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వ సేవలను చేరువచేశారన్నారు. ఈ కార్యక్రమంలో జగ్గంపేట ఎంపీపీ అత్తులూరి నాగబాబు, కిర్లంపూడి ఎంపీపీ తోట రవి, రాష్ట్ర వైఎస్సార్ సీపీ సేవాదళ్ కార్యదర్శి ఒమ్మి రఘురాం, రాష్ట్ర సీడ్ కార్పొరేషన్ డైరెక్టర్ ఇళ్ల అప్పారావు కాపు, జగ్గంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ జనపరెడ్డి బాబు, కాండ్రేగుల, రామవరం గ్రామానికి చెందిన సర్పంచులు, వైఎస్సార్ సీపీ నేతలు పాల్గొన్నారు.

'సలాది' చిత్రానికి అవార్డు



విజయవాడలో 'మార్నింగ్ డ్యూటీ' ఛాయా చిత్రానికి అవార్డు అందుకుంటున్న సలాది కృష్ణ

ప్రత్తిపాడు: ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా ఉభయ రాష్ట్రాలకు సంబంధించి ఆంధ్రప్రదేశ్ ఫొటోగ్రఫీ అకాడమీ నిర్వహించిన ఫొటో కాంపిటిషన్‌లో ప్రత్తిపాడు ఫొటోగ్రాఫర్ చిత్రానికి అవార్డు లభించింది. ప్రత్తిపాడు గ్రామానికి చెందిన ఈశ్వర ఫొటో స్టూడియో అధినేత సలాది కృష్ణ తీసిన 'మార్నింగ్ డ్యూటీ' అనే మోనోక్రోమ్ ఛాయా చిత్రం అవార్డుకు ఎంపికైంది. ఈ అవార్డును విజయవాడ పింగళి వెంకయ్య రోటరీ ప్లాటినం జూబ్లీ సెంటర్ ఆడిటోరియమ్‌లో శనివారం జరిగిన అవార్డుల ప్రదానోత్సవంలో అందుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వ సహకార, మార్కెటింగ్ శాఖల సలహాదారు బత్తుల బ్రహ్మానందరెడ్డి, ఆంధ్రప్రదేశ్ స్పెషల్ 6వ బెటాలియన్ కమాండెంట్ కేవీఎస్‌వీ సుబ్బారెడ్డి చేతుల మీదుగా సలాది కృష్ణ అవార్డు అందుకున్నారు. కార్యక్రమంలో ఏపీ ఫొటో అకాడమీ ప్రధాన కార్యదర్శి కానాల సుధాకర్‌రెడ్డి, జాయింట్ సెక్రటరీ తుమ్మలపల్లి వీరభద్రరావు, రాజమహేంద్రవరం బాబుల్ స్టూడియో అధినేత బాబులు, సురేష్ తదితరులు పాల్గొన్నారు. కాగా అవార్డు అందుకున్న సలాది కృష్ణను సంబు ప్రభాకర్, వీరబొమ్మ రాజశేఖర్, ఆరణి కళాధరరావు, తోట సుబ్బారావు, చెవల శ్రీను, ప్రత్తిపాడు మండల ఫొటోగ్రఫీ అసోసియేషన్ సభ్యులు అభినందించారు.

పట్టపగలూ వెలుగులు

- పట్టించుకోని అధికారులు
- పెరిగిపోతున్న విద్యుత్ బిల్లులు



లోవ కొత్తూరులో పట్టపగలూ వెలుగుతున్న వీధిలైట్లు

తుని రూరల్: గ్రామాల్లో పట్టపగలూ ఎల్ఈడీ లైట్లు వెలుగుతూనే ఉంటున్నాయి. లోవకొత్తూరు, హెచ్.కొత్తూరు, నందివంపు తదితర గ్రామాల్లో వీధిలైట్లు రాత్రులే కాకుండా పగలు వెలుగుతున్నాయి. సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, పంచాయతీ విస్తరణ అధికారులు, మండల పరిషత్ అధికారులు పట్టించుకోవడం లేదు. లక్షలాది రూపాయల విద్యుత్ బిల్లులు తడిపిమోపెడవుతున్న డివిజన్‌స్థాయి అధికారులు చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారు. 2014–19 మధ్య అప్పటి ప్రభుత్వం ప్రైవేట్ సంస్థలకు వీధిలైట్ల నిర్వహణ అప్పగించింది. ఆయా ప్రైవేట్ సంస్థలు అప్పటి వరకు ఉన్న సాధారణ లైట్లను తొలగించి ఎల్ఈడీ లైట్లను అమర్చారు. అప్పటి నుంచి వీధిలైట్లు పగలూ రాత్రులు తేడా లేకుండా వెలుగుతున్నాయి. దీనివల్ల రూ.లక్షలు వృథా అవుతున్న పట్టించుకోవడంలేదు. సచివాలయంలో ప్రత్యేకంగా ఎనర్జీ అసిస్టెంట్లను నియమించినా పరిస్థితిలో మార్పురాలేదు. 2014 పూర్వం ఇంతమంది సిబ్బందిలేనప్పుడు రోజు రాత్రివేళల్లో వీధిలైట్లు వేసి ఉదయాన్నే ఆఫ్ చేసేవారు. ఇప్పటికైన డివిజన్, జిల్లా స్థాయి అధికారులు స్పందించి చర్యలు తీసుకుంటే రాత్రివేళల్లో వీధిలైట్లు వేసి, పగలు ఆర్పివేయిస్తే లక్షలాది రూపాయలు కరెంటు బిల్లులు ఆదా అవుతాయి. ఈ నిధులను ఆయా గ్రామాల అభివృద్ధికి వినియోగించుకోవచ్చు.

వాటా ఇస్తానని సొమ్మును కాజేసిన వ్యక్తి అరెస్టు

కొత్తపల్లి: హేచరీ వ్యాపారంలో వాటా ఇప్పిస్తానని, ఉద్యోగాలు వేయిస్తామని చెప్పి సొమ్ములు తీసుకుని మోసగించిన ఒక వ్యక్తిని అరెస్టు చేసినట్టు శనివారం పోలీసులు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పొన్నాడ శివారు సీలంవారిపాలెంకు చెందిన తంటింటి అప్పారావుకు హేచరీలో వాటా ఇప్పిస్తానని, ఉద్యోగాలు వేయిస్తానని మాయమాటలు చెప్పి 2021 మే నెలలో విశాఖపట్నానికి చెందిన బేతాల విజయప్రభాకర్ సుమారు రూ.54 లక్షలను తీసుకున్నాడు. అప్పటి నుంచి అతను గైర్హాజరు కాగా అప్పారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై రామలింగేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయగా విజయప్రభాకర్‌ను శనివారం పిఠాపురం రైల్వే స్టేషన్ వద్ద అరెస్టు చేసి పిఠాపురం కోర్టులో హాజరుపర్చగా రిమాండ్ విధించినట్లు పోలీసులు తెలిపారు.

కొనసాగుతున్న ప్లాస్టిక్ బాటిళ్ల నిషేధం



భక్తుల వద్ద స్వాధీనం చేసుకున్న ప్లాస్టిక్ వాటర్ బాటిల్స్

అన్నవరం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరం దేవస్థానంలో ప్లాస్టిక్ వాటర్ బాటిళ్ల నిషేధం కొనసాగుతోంది. గత మూడు రోజులుగా దేవస్థానం టోల్‌గేట్ వద్ద భక్తుల వాహనాల నుంచి ప్లాస్టిక్ వాటర్ బాటిల్స్‌ను స్వాధీనం చేసుకుంటున్న విషయం తెలిసిందే. ఈ వాటర్ బాటిళ్లలో నీటిని తొలగించి ఖాళీ బాటిల్స్‌ను టిన్నుల్లో వేశారు. మూడు రోజుల్లో సుమారు మూడు వేల బాటిల్స్ వచ్చాయని అధికారులు తెలిపారు. కిన్లే కంపెనీ శనివారం దేవస్థానానికి రెండు బాటిల్స్ క్రషింగ్ మెషీన్లను అందజేసింది. దీంతో దొరికిన ప్లాస్టిక్ బాటిళ్లను శానిటరీ ఇన్‌స్పెక్టర్ వేంకటేశ్వరరావు ఆ మెషీన్లలో వేసి క్రసింగ్ చేశారు. వీటి నుంచి వచ్చిన పొడిని ఆ కంపెనీ కొనుగోలు చేస్తుందని ఈఓ చంద్రశేఖర్ ఆజాద్ తెలిపారు.

ఘనంగా ఫొటోగ్రఫీ దినోత్సవం



ఏలేశ్వరంలో డాగురె చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఫొటోగ్రాఫర్లు



గోకవరంలో డాగురె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న ఫొటోగ్రాఫర్లు

ఏలేశ్వరం: ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని శనివారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఏలేశ్వరం మండల ఫొటో, వీడియోగ్రాఫర్ల సంఘం ఆధ్వర్యంలో కెమెరా సృష్టి కర్త సర్‌లూయిస్ ఆక్వెన్ మాండ్ డాగురె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్థానిక ప్రభుత్వాసుపత్రిలో రోగులకు రొట్టెలు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంఘ నాయకులు దవులూరి సత్యనారాయణ, స్వర్ణపూడి శ్రీనివాస్, మొలుగు రవికుమార్, డోకుల శ్రీనివాసరెడ్డి కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

గోకవరం: ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని గోకవరంలో శనివారం మండల ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కెమెరా సృష్టకర్త లూయిస్ డాగురె చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు బాలు, గంధం బుజ్జి, తోలేటి రాంప్రసాద్, గంగాధర్, కొండలరావు ఉన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫొటోగ్రాఫర్లు తమ నైపుణ్యం ప్రదర్శించి ఉత్తమ ఫొటోగ్రాఫర్‌గా పేరు గాంచేలా ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. అనంతరం ఒకరికి ఒకరు స్వీట్స్ పంచుకున్నారు.

జగ్గంపేట: ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని కొత్తూరు దుర్గమ్మ తల్లి ఆలయం వద్ద శనివారం ఘనంగా నిర్వహించారు. మండల ప్రొఫెషనల్ ఫొటో, వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మంచాల హేమాద్రి ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కెమెరా సృష్టికర్త లూయిస్ డాగురె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

హెచ్‌పీ గ్యాస్ ఉచిత సేవా శిబిరం



రాయితీపై గ్యాస్‌స్టౌ అందిస్తున్న హెచ్‌పీ కంపెనీ ప్రతినిధులు

తొండంగి: పెరుమాళ్లపురంలో హెచ్‌పీ గ్యాస్ ఉచిత సేవా శిబిరం శనివారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో కాకినాడ జిల్లా ఏరియా సేల్స్ ఆఫీసర్ ఎంఎల్ఎస్ శ్రీనివాసరావు పాల్గొన్నారు. పెరుమాళ్లపురం పరిసర ప్రాంత ప్రజలకు రాయితీపై హెచ్‌పీ గ్యాస్ కంపెనీ పరికరాలను అందజేశారు. ఈ సందర్భంగా వైష్ణోదేవి గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి వడ్డాది ప్రసాద్ ఆధ్వర్యంలో గ్యాస్ ప్రమాదాలపై రాజమహేంద్రవరానికి చెందిన వీర్నాల కృష్ణ కళాజాతా బృందం ప్రదర్శన ఇచ్చింది. గ్యాస్ ప్రమాదల పరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కళాత్మకమైన మాటలతో వినియోగదారులకు అవగాహన కల్పించారు.

ఓటరు నమోదు ప్రక్రియ పారదర్శకంగా ఉండాలి

కిర్లంపూడి: ఓటర్ నమోదు ప్రక్రియ పారదర్శకంగా ఉండాలని ఈఆర్ఓ సుధారాణి అధికారులకు సూచించారు. శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్వోలతో ఓటర్ నమోదుపై సమీక్షా సమావేశం ఏర్పాటు చేశారు. ఓటర్ నమోదు ప్రక్రియాలో బీఎల్వోల నుంచి వచ్చి పలు సందేశాలను ఆమె నివృత్తి చేశారు. ఈ సమావేశంలో తహసీల్దార్ కేవీ మాధవరావు, డీటీ మడిక శ్రీనివాసరావు ఉన్నారు.

ప్రతిఒక్కరూ భక్తిభావం పెంపొందించుకోవాలి



ఆధ్యాత్మిక ప్రసంగం చేస్తున్న సూర్యనారాయణ

ఏలేశ్వరం: ప్రతిఒక్కరూ భక్తిభావం పెంపొందించుకోవాలని ఆర్ఎస్ఎస్ ప్రముఖ్ కె.సూర్యనారాయణ అన్నారు. విశ్వహిందూపరిషత్ ఆధ్వర్యంలో శ్రావణ మాసం తొలిశనివారం పురస్కరించుకుని పట్టణంలో శనివారం ఆధ్యాత్మిక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సూర్యనారాయణ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ భక్తిభావం కలిగి ఉండడంతో మానసిక ప్రశాంతత పొందవచ్చాన్నారు. అనంతరం పరిషత్ అనుబంధ మాతృశక్తి, దుర్గావాహిని మహిళా సంఘాల ఆధ్వర్యంలో భగవద్గీత ప్రవచనం, విష్ణుసహస్ర, శివ స్తోత్రాలు, లలితాసహస్ర పారాయణాలు చేశారు. అనంతరం భక్తిగీతాలు ఆలపించారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ ప్రతినిధులు ఏడీవీ ప్రసాద్, కటకం కిరిటీ, ఉడతల రమణారావు, సంఘ మహిళాసభ్యులు పాబోలుదేవి, లక్ష్మీకుమారి, మల్లేశ్వరీ, ఇందిరా, పద్మజ, సూర్యకుమారి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

ఫ్యామిలీ డాక్టర్‌తో చేరువైన వైద్యం



వేళంగిలో రోగులకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి సౌమ్యశ్రీ

శంఖవరం: ఫ్యామిలీ డాక్టర్ విధానంతో ప్రజలకు వైద్యం చేరువైందని పి.మల్లాపురం పీహెచ్‌సీ వైద్యాధికారి సౌమ్యశ్రీ తెలిపారు. వేళంగి గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. రోగులకు పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. మంచానికే పరిమితమైన రోగుల ఇళ్లకు వెళ్లి వైద్యం అందిస్తున్నారు. బాలికలకు వ్యక్తిగత శుభ్రతపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కేంద్రం, పాఠశాలకు వెళ్లి చిన్నారులను పరీక్షించారు. 50 మంది సాధారణ రోగులు, 10 మంది గర్భిణులు, ఇద్దరు బాలింతలు, 40 మంది మధుమేహ బాధితులు, 30 మంది రక్తపోటుతో బాధపడుతున్న వారికి సేవలు అందిచామని వైద్యాధికారి సౌమ్యశ్రీ తెలిపారు.

ఇళ్ల నిర్మాణాల పరిశీలన



జగన్నాథపురం జగనన్న కాలనీలో ఇళ్లనిర్మాణాలను పరిశీలిస్తున్న అధికారులు

కోటనందూరు: మండల వ్యాప్తంగా జగనన్న కాలనీల్లో అధికారులు పర్యటించారు. శనివారం హౌసింగ్ డే సందర్భంగా అధికారులు, ప్రజాప్రతినిధులు కాలనీలను సందర్శించి ఎదురవుతున్న సమస్యలపై లబ్ధిదారులను ఆరా తీశారు. మంత్రి దాడిశెట్టి రాజా సహకారంతో కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్టు చెప్పారు. జగన్నాథపురంలో ఎంపీడీఓ సుబ్రహ్మణ్యశర్మ, సొసైటీ చైర్మన్ గొర్లి రామచంద్రరావు నిర్మాణాలు పరిశీలించారు. నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలని లబ్ధిదారులకు సూచించారు. వారితోపాటు హౌసింగ్ ఏఈ శేఖర్ ఉన్నారు.

సత్యదేవుని సన్నిధిలో ఎమ్మెల్సీ పద్మశ్రీ



స్వామివారిని దర్శించుకున్న ఎమ్మెల్సీ పద్మశ్రీ దంపతులు

అన్నవరం: గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా నామినేట్ అయిన కర్రి పద్మశ్రీ కుటుంబ సభ్యులతో కలిసి శనివారం రత్నగిరిపై సత్యదేవుని దర్శించి పూజలు చేశారు. ఆలయం వద్ద వారికి పండితులు ఘనంగా స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం అనంతరం వేదపండితులు వేదాశీస్సులు అందజేసి స్వామివారి ప్రసాదాలు బహూకరించారు. వారి వెంట స్థానిక వైఎస్సార్ సీపీ నాయకుడు ఈరంకి ఉదయ్ ఉన్నారు.

ఎల్ఐసీ పాలసీతో కుటుంబానికి భద్రత



జగ్గంపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది

జగ్గంపేట: ఎల్ఐసీ పాలసీ ఉంటే ఆ కుటుంబానికి భద్రత ఉంటుందని ఆల్ ఇండియా ఎల్ఐపీ ఎంప్లాయిస్ యూనియన్ ఉపాధ్యక్షుడు పి.సతీష్ తెలిపారు. పెద్దాపురం ఎల్ఐసీ బ్రాంచి ఆధ్వర్యంలో జగ్గంపేటలో ఇంటింటికీ ఎల్ఐసీ కార్యక్రమం శనివారం నిర్వహించారు. అనంతరం గ్రామాల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన సతీష్ మాట్లాడుతూ ఎల్ఐపీ పాలసీతో ప్రయోజనాలు తెలియజేశారు. మూడు నెలల పాటు ఇంటింటికీ ఎల్ఐసీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజమండ్రి డివిజన్ అధ్యక్షులు జి.రాంబాబు, పెద్దాపురం బ్రాంచి నాయకులు, డివిజన్ పరిధిలోని ఏజెంట్లు పాల్గొన్నారు.

లారీ ఢీకొని వ్యక్తి మృతి

కిర్లంపూడి: గుర్తు తెలియని లారీ ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన శనివారం తెల్లవారు జామున కృష్ణవరం టోల్ ప్లాజా వద్ద చోటు చేసుకున్నట్లు కిర్లంపూడి ఎస్సై బి.ఉమామహేశ్వరరావు తెలిపారు. ఆయన తెలిపి వివరాల మేరకు.. గత కొన్ని రోజులుగా మతిస్థిమితంలేని వ్యక్తి పెద్దగా అరుచుకుంటూ బూరుగుపూడి, కృష్ణవరం టోల్ ప్లాజా సమీపంలోను తిరిగేవాడు. శనివారం రోడ్డు దాటుతుండగా జగ్గంపేట వైపు నుంచి వస్తున్న గుర్తు తెలియని లారీ ఢీకొట్టడంతో మతిస్థిమితంలేని వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. దీనిపై స్థానిక సర్పంచ్, వీఆర్వో ఇచ్చిన తీర్మానంపై దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

ఏఎంసీ మాజీ చైర్మన్ కుటుంబానికి పరామర్శ

గండేపల్లి: ఉప్పలపాడు గ్రామ సర్పంచ్ అడబాల ఆంజనేయులు తండ్రి ఏఎంసీ మాజీ చైర్మన్ అడబాల కుందరాజు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన కుటుంబానికి టీడీపీ నాయకులు పరామర్శించారు. పరామర్శించిన వారిలో కేంద్ర మాజీ మంత్రి ఎంఎం పల్లంరాజు, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జ్యోతుల నెహ్రూ, కాంగ్రెస్ పార్టీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి మరోతి శివగణేష్, ఇతర పార్టీల నేతలు తదితరులు ఉన్నారు.